


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 14-01-2024 సంపుటి : 06 సంచిక : 126 పేజీలు : 8 వెల : రూ 3-00

**సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రద్దీ**
**అదనపు బస్సులు నడుతుపున్న ఆర్టీసీ**
**తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు**
**బోసిపోతున్న జంటనగరాలు**





# సొంతూరికి పయనం..

హైదరాబాద్,జనవరి13 సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణ వాసులు సొంతూళ్లకు బయలుదేరారు. దీంతో నగగరాలు ఖాళీ అవుతున్నాయి. ఈ క్రమంలో బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు జనంతో కిక్కిరిసిపోతున్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రయాణికులతో రద్దీగా మారింది. ప్రయాణికులు టికెట్ల కోసం గంటల తరబడి కౌంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈ నేపథ్యంలో రద్దీని తగ్గించేందుకు రైల్వే అధికారులు అదనంగా మరికొన్ని టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. అదనంగా కౌంటర్లను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకుని వచ్చారు. అందుకుతగ్గట్లుగా సిబ్బందిని కూడా పెంచారు. రైల్వే స్టేషన్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రైల్వే పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు. రైళ్ల రాకపోకల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రయాణికులకు తెలిపేందుకు అదనంగా మరికొంతమంది అధికారులను ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండుగకు ప్రజలు సొంత ఊర్లకు వెళుతుండడంతో హైదరాబాద్ ఖాళీ అవుతోంది. శుక్రవారం వేకువజామున కూడా వందలాది వాహనాల్లో పలువురు తమ సొంతూళ్లకు బయలుదేరారు. శనివారం కూడా రద్దీ కొనసాగింది. యధావిధిగానే బస్సు స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో రద్దీ కనిపించింది. తెలంగాణ పల్లెలకు వెళ్లేవారు వివిధ రూట్లలో బయలు దేరారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరవాసులు పల్లెబాట పడుతున్నారు. దీంతో పండుగకు ఊరెళ్లే ప్రయాణికులతో రైళ్లు, బస్సులు కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్ నుంచి ఆంధ్రా ప్రాంతానికి వెళ్ళే రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై శనివారం వేకువ జామున భారీగా వాహనాలు నిలిచిపోయాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు రెండు కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. టోల్ ప్లాజా వద్ద పది గేట్లు తెరిచినా వాహనాల రద్దీ తగ్గలేదు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్లన్నీ బుకింగ్ అయ్యాయి. దూర ప్రాంత రెగ్యులర్ రైళ్లలో రెండు నెలల క్రితమే రిజర్వేషన్లు పూర్తవడంతో పాటు అదనపు ఛార్జీలతో నడిపే ప్రత్యేక రైళ్లలో సీట్లు నిండిపోయాయి. వీటిలో చాలా రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ పరిమితి కూడా దాటిపోయింది. బెర్తు, సీటు దొరక్కపోయినా.. నిల్చొనైనా వెళ్దామనుకున్నా టికెట్లు బుక్ చేసుకునే పరిస్థితి లేదు. దీంతో సంక్రాంతికి సొంతూరుకు వెళ్లడమెలా అని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సికింద్రాబాద్ తోపాటు కాచిగూడ, నాంపల్లి స్టేషన్లు సంక్రాంతికి ఊళ్లకు వెళ్లే తెలుగు రాష్ట్రాల ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.




# చంద్రబాబుకు పెనమలూరు సెగ..

## బోడె ప్రసాద్ వర్గం ఆందోళన



విజయవాడ: టీడీపీ అధినేత చంద్రబాబుకు విజయవాడలో నిరసన సెగ తగిలింది. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వర్గం చంద్రబాబు కాన్వాయ్ వైపు దూసుకొచ్చింది. బోడె ప్రసాద్‌కే పెనమలూరు టికెట్ ఇవ్వాలని ఆయన మద్దతుదారులు నినాదాలు చేశారు. ఇసుక కుంభకోణం కేసులో పూచీకత్తులు సమర్పించడానికి తడిగడప సీఐఈడీ కార్యాలయానికి చంద్రబాబు వచ్చిన సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి టీడీపీలో చేరిక నేపథ్యంలో ఆయనకు వ్యతిరేకంగా బోడె ప్రసాద్ వర్గం ఆందోళన చేపట్టింది. నిరసనకారులను అడ్డుకోవడం పోలీసుల వల్ల కూడా కాలేకపోయింది. దీంతో పోలీసులు ఏర్పాట్లు చేసిన బారికేడ్లను సైతం తోసేసి ప్లకార్డులతో బాబు వైపు దూసుకొచ్చారు. కాగా ఇసుక పాలసీ కేసుతో పాటు ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు, మద్యం పాలసీ కేసులో బాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

# ఇండియా కూటమి చైర్‌పర్సన్‌గా మల్లికార్జున ఖర్గే.. కన్వీనర్‌గా నితీష్?



న్యూఢిల్లీ: ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎంపికయ్యారు. ఇండియా కూటమికి చెందిన పార్టీల ముఖ్య నేతలు శనివారం వర్చువల్ విధానంలో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా కూటమిని మరింత బలోపేతం చేయడం, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు, కూటమికి కన్వీనర్ నియా మకం అంశాలపై వారు చర్చించారు. భాగస్వామ్య పక్షాల మధ్య నెలకొన్న అభిప్రాయ భేదాల పరిష్కారంపైనా సమావేశం దృష్టి సారించింది. కూటమి అధినేత ఎంపిక విషయంలో ప్రతిపక్ష నేతలంతా తీవ్ర చర్చలు జరిపి.. ఖర్గేను చైర్‌పర్సన్‌గా నియమిస్తూ నిర్ణయించారు. అయితే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు విషయం ఇంకా తేలలేదు. సీట్ల పంపకాలపై నేతలు చర్చలు జరిపినప్పటికీ ఇంకా ఫైనల్ నిర్ణయం తీసుకోలేదు. కాగా కూటమి కన్వీనర్‌గా బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను నేతలు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అయితే అన్ని పార్టీలు ఏకీభవిస్తేనే తాను కన్వీనర్‌గా ఉంటానని నితీష్ స్పష్టం చేసినట్లు సమాచారం. వాస్తవానికి కూటమి అధ్యక్షుడి పదవికి నితీష్ పోటీలో ఉండగా... కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎవరైనా ఆ బాధ్యతలు చేపడితే బాగుంటుందని నేటి భేటీలో ఆయన కోరినట్లు సమాచారం. వేరే కార్యక్రమాల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఈ భేటీలో పాల్గొనలేదు. ఇదిలా ఉండగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా కాంగ్రెస్‌తో సహా విపక్ష పార్టీలు ఏకమై ఇండియా కూటమిగా ఏర్పడిన విషయం తెలిసిందే.


# రాజ్‌భవన్ లో ఘనంగా సంక్రాంతి సంబరాలు..

**ఢిల్లీ పర్యటనపై గవర్నర్ స్పష్టత..**

హైదరాబాద్ ,తెలంగాణ రాజ్‌భవన్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గవర్నర్ తమిళసై రాజ్‌భవన్ ఉద్యోగులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు వేసి, చెరుకు గడలను ఏర్పాటు చేసి అందులో పొంగల్ తయారు చేశారు. రకరకాల పూలతో ఇంటిని అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసిననంతరం తెలంగాణ ప్రజలకు సంక్రాంతి, పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని కాంక్షించారు. ఈ సారి సంక్రాంతి వేడుకలు పూర్తైన వారం రోజులకు అయోధ్యలోని శ్రీరాముని మందిరం ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు. అందుకే ఈ ఏడాది సంక్రాంతి ప్రత్యేకం అన్నారు. త్వరలో రామ్ మందిర్?కి సంబంధించిన తెలుగు, హిందీ పాటలను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా తన ఢిల్లీ పర్యటన గురించి కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. సంక్రాంతి పండుగ వేడుకల నేపథ్యంలో ఢిల్లీ వెళ్తున్నానన్నారు. ఇది రాజకీయ పరమైన పర్యటన కాదని స్పష్టం చేశారు. దీనికి కారణం గతంలో ఆమె ఢిల్లీ పర్యటించినప్పుడు లోక్ సభ ఎన్నికల్లో ఎంపీగా తమిళనాడు నుంచి పోటీ చేయనున్నట్లు వచ్చాయి.



# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో భారీ అగ్ని ప్రమాదం.. భారీగా ఆస్తి నష్టం



విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో శనివారం( జనవరి 13) సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. స్టీల్ ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్ –3లో మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ప్లాంటుకు చేరుకుని మంటలార్పుతున్నారు. అగ్నిప్రమాదం కారణంగా ప్లాంటులో భారీ ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. గతంలోనూ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన పలు అగ్ని ప్రమాదాల్లో ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించాయి

# ముంబైలో భారీ అగ్ని ప్రమాదం..

## ఆరు అంతస్తుల్లో చెలరేగిన మంటలు



ముంబై: మహారాష్ట్ర రాజధాని ముంబైలో శనివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. డోంబివాలిలోని ఓ ఎత్తైన భవనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. డోంబివాలి ఈస్ట్‌లోని లోధా పలావా టౌన్‌షిప్‌లోని కాసా అరేలియా భవనంలో ఈ ఘటన జరిగింది. భవనంలోని ఆరు అంతస్తుల్లో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది.. సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. అయిదు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది.

భవనం నుంచి భారీ ఎత్తున మంటలు. దట్టమైన పొగలు వెలువుతున్న దృశ్యాలు నెట్టింట్లో చక్కర్లు కొడున్నాయి. అయితే రెస్క్యూ టీమ్‌లు అందరినీ సకాలంలో బయటకు తీసుకు రావడంతో.. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. కాగా అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు.

# కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ



ఢిల్లీ, : టీపీసీసీ చీఫ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హస్తిన పర్యటనలో ఉన్నారు. శనివారం మధ్యాహ్నం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆయన భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికతో పాటు నామినేటెడ్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తులో భాగంగానే ఈ భేటీ అని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. సంక్రాంతిలోపు నామినేటెడ్ పోస్టుల్ని భర్తీ చేసి తీరతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. ఈ క్రమంలోనే ఢిల్లీకి వెళ్లారాయన. ఇక.. ఎమ్మెల్యే కోటా కింద రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహణకు రంగం సిద్ధమైన నేపథ్యంలో.. అభ్యర్థుల ఎంపికపైనా ఆయన అధిష్టానంతో చర్చలు జరుపుతున్నారు.

# ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ పదవికి కొమ్మినేని శ్రీనివాసరావు రాజీనామా



విజయవాడ, సీఆర్ ఏపీ మీడియా అకాడమీ(సీ రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ) చైర్మన్ పదవికి సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు రాజీనామా ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో స్పష్టత ఇచ్చారాయన. తనపై నమ్మకంతో మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమించి.. పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారాయన. సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు.. 2022 నవంబర్ 10వ తేదీన ఏపీ మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ 13 నెలల 15 రోజులు కాలంలో వర్కింగ్ జర్నలిస్టుల కోసం పలుకార్యక్రమాలు చేయగలగడం సంతృప్తినిచ్చిందని ప్రకటనలో పేర్కొన్నారాయన. అయితే.. ఈ నెల 16 వరకు సంక్రాంతి నేపథ్యంలో సెలవులు ఉండడంతో.. 17 వ తేదీ నుంచి తన రాజీనామా అమలులోకి వస్తుందని ఆయన వెల్లడించారు.

# సంపాదకీయం

ఆదివారం 14-01-2024

## గఘన విజయాలు

చంద్రయాన్ ?3 విజయవంతం కావడం శాస్త్రరంగంలో భారత్ 2023లో సాధించిన అతిగొప్ప విజయం. ఏళ్లపాటు శ్రమించిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల విజయమిది. చంద్రయాన్ సక్సెస్ తరువాత కొంత కాలానికే భారతదేశపు ప్రతిష్ఠాత్మక ఆదిత్య?ఎల్1 ప్రయోగం కూడా విజయవంతంగా ముగియడం హైలైట్లలో మరొకటి. 'లిగో ఇండియా' ప్రాజెక్టుకు మన దేశం అంగీకరించడం ఒక మేలి మలుపు. మహారాష్ట్రలోని హింగోలి ప్రాంతంలో లిగో ఇండియా నిర్మాణం ప్రారంభమైంది. నేషనల్ క్వాంటమ్ మిషన్ కు కూడా 2023లోనే శ్రీకారం పడింది.భారతదేశంలో ప్రచార ఆర్భాటాలకు చిక్కని, అత్యుత్తమ, అంత ర్జాతీయ స్థాయి పరిశోధనలు ఎన్నో నవెూదయ్యాయి. వీటిల్లో ముఖ్యంగా చెప్పుకోవాల్సినవి హైదరాబాద్‌లోని లాకోన్స్లో ఒక పర్యావరణ వ్యవస్థలో జీవవైవిధ్యతను గుర్తించేందుకు అభివృద్ధి చేసిన పద్ధతి. సీసీఎంబీ అనుబంధ సంస్థ అయిన లాకోన్స్లో ఎస్. మను, జి.ఉమాపతి ఈ పరిశోధనకు నేతృత్వం వహించారు. నీరు, మట్టి, గాలుల్లోని డీఎన్ ఏ పోగుల ఆధారంగా జీవవైవిధ్యతను కొలవడం ఈ పద్ధతి ప్రత్యేకత..నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, బజ్ ఆల్డ్రిన్ లను జాబిల్లి పైకి మోసుకెళ్లిన అపోలో?11 లూనార్ మాడ్యూల్‌లో బ్లాక్ అండ్ వైట్ టీవీ కెమెరా ఉండేది. ఆ ఇద్దరు వ్యోమగాములు చందమామపై మొదటిసారి అడుగుపెట్టిన చారిత్రక ఘట్టపు లైవ్ ప్రసారం ఈ కెమెరా ద్వారానే జరిగింది. అప్పట్లో ఈ ప్రసారాన్ని 53 కోట్ల మంది వీక్షించారు. అంతరిక్ష పరిశోధనల్లో 1969 జూలై 20 నాటి ఈ ఘటన అత్యంత కీలకమైందనడంలో సందేహం లేదు. అలాగే టెలివిజన్ ప్రసారాల్లోనూ ఓ మైలురాయిగా నిలిచింది. యాభై ఏళ్ల తరువాత 2023 ఆగస్టు 23న కూడా దాదాపు ఇలాంటి చారిత్రక ఘటనే భారత్ లోనూ నమోదైంది. చంద్రయాన్ ?3 జాబిల్లిపై అడుగుపెట్టిన ఘట్టాన్ని యూట్యూబ్‌లోనే 80.9 లక్షల మంది వీక్షించారు. యూట్యూబ్ లైవ్ స్ట్రీమ్‌కు సంబంధించి ఇదో రికార్డు. చంద్రయాన్ ?3 విజయవంతం కావడం శాస్త్రరంగంలో భారత్ 2023లో సాధించిన అతిగొప్ప విజయం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏళ్లపాటు శ్రమించిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల విజయమిది. చంద్రయాన్ ప్రయోగం సక్సెస్ తరువాత కొంత కాలానికే భారతదేశపు ప్రతిష్ఠాత్మక ఆదిత్య?ఎల్1 ప్రయోగం కూడా విజయవంతంగా ముగియడం హైలైట్లలో మరొకటిగా చెప్పుకోవచ్చు. కొత్త సంవత్సరం తొలివారంలో ఈ అంతరిక్ష నౌక సూర్యుడిని పరిశీలించేందుకు అనువైన స్థానానికి చేరుకోనుంది. ఈ రెండు ప్రయోగాలు మాత్రమే కాకుండా 2023లో 'ఇస్రో' ఖాతాలో పలు కీలకమైన ప్రాజెక్టులను అమలు చేసిన ఖ్యాతి చేరింది. రీయూజబుల్ లాంచ్ వెహికల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించడం, రెండోతరం నావిగేషన్ ఉప గ్రహాల్లో తొలి ప్రయోగం, మానవ సహిత ప్రాజెక్టు 'గగన్‌యాన్ 'లో క్రూ ఎస్కేప్ మోడల్ పరీక్ష ఈ జాబితాలో కొన్ని మాత్రమే. దేశం శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో అంతరిక్ష ప్రయోగాలకు ఆవల కూడా మన దేశం పలు విజయాలను నమోదు చేసింది. లేజర్ ఇంటర్‌ఫెరోమీటర్ గ్రావిటేషనల్ వేవ్ అబ్జర్వేటరీ (లిగో ఇండియా)కి ప్రభుత్వం అంగీకరించడం ఒక మేలి మలుపు. మహారాష్ట్రలోని హింగోలి ప్రాంతంలో లిగో ఇండియా ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైంది. ప్రపంచంలోనే అరుదైన గురుత్వ తరంగాల వేధశాలగా, అతి సున్నితమైన నాలుగు కిలోమీటర్ల పొడవైన ఇంటర్‌ఫెరోమీటర్ సొరంగం ఉన్నదిగా ఇది రికార్డులకు ఎక్కింది. కృష్ణ బిలాలు, న్యూట్రాన్ నక్షత్రాల వంటివి కలిసిపోయినప్పుడు పుట్టే గురుత్వ తరంగాలను గుర్తించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. అమెరికాలో ఇప్పటికే పని చేస్తున్న లిగో వేధశాలలతో కలిసి హింగోలి వేధశాల పనిచేస్తుంది.నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు కూడా 2023లోనే అడుగు పడింది. సూపర్ కండక్టింగ్, ఫొటోనిక్ ప్లాట్‌ఫామ్‌ల సాయంతో మధ్యమ స్థాయి క్వాంటమ్ కంప్యూటర్లు తయారు చేయడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. దీంతోపాటే కృత్రిమ మేధ ద్వారా దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను గుర్తించేందుకు కూడా జాతీయ స్థాయి కార్య క్రమం ఒకటి ఈ ఏడాది మొదలైంది. కృత్రిమ మేధను బాధ్యతా యుతమైన టెక్నాలజీగా అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. కర్నాల్(హరియాణా)లోని నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ శాస్త్రవేత్తలు దేశీ గిర్ జాతి ఆవును క్లోనింగ్ పద్ధతి ద్వారా సృష్టించడం 2023 విశేషాల్లో ఇంకోటి. బనారస్ హిందూ యూనివర్సిటీకి చెందిన జ్ఞానేశ్వర్ చౌబే నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం దక్షిణాసియా జన్యుక్రమాల్లో ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. సింహళీయులకు, శ్రీలంకలోని తమిళులకు మధ్య దగ్గరి జన్యు సంబంధాలు ఉన్నట్లు పరిశోధన పూర్వకంగా నిర్ధారించింది. ఆసక్తికరమైన ఇంకో విషయం ఏమిటంటే, ఈ రెండు వర్గాల ప్రజలకూ మరాఠా జనాభాకూ మధ్య సంబంధాలు ఉండటం! కోవిడ్ విషయానికి వస్తే, పుణె కేంద్రంగా పనిచేస్తున్న జెన్నోవా బయో ఫార్మాస్యూటికల్స్ దేశీయంగా తయారు చేసిన ఎంఆర్ఎన్ ఏ టీకాను విడుదల చేసింది. ఒమిక్రాన్ వైరస్ నియంత్రణకు పనికొస్తుందీ టీకా.దేశం మొత్తమ్మీద శాస్త్ర పరిశోధనలకు అవసరమై నిధుల కేటా యింపును పర్యవేక్షించేందుకు 'నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ' ఒకదాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. వివరాలు పూర్తిగా బహిరంగం కాలేదు. ఇదిలా ఉంటే దశాబ్దాలుగా పనిచేస్తున్న విజ్ఞాన్ ప్రసార్‌ను 2023లో మూసివేశారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఐఎస్‌సీఏ)కు నిధుల కేటాయింపులు తగ్గించారు.

## నాటు సారా స్థావరాలపై దాడులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 13-నంద్యాల జిల్లా ఎస్పీ కే. రఘువీర్ రెడ్డి ఆదేశాలమేరకు ఆత్మకూరు ఎస్ డీ పీ ఓ శ్రీనివాసరావు పర్యవేక్షణ లో శనివారం తెల్లవారుజామున ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎమ్.నాగభూషణ్ ఆధ్వర్యంలో సిద్ధాపురం గ్రామ పొలిమేరల్లో చేసిన కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి,సోదాలు చేయగా రెండు ప్రదేశాలలో ఇద్దరి వ్యక్తులకి చెందిన సుమారు 900 లీటర్ల ఫర్మెంటెడ్ వాష్ (బెల్లం వూట) మరియు 20 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకొవడం జరిగింది. సారాయి బట్టి ని మరియు బెల్లం వూట ని ధ్వంసం చేసి సంబంధిత వ్యక్తుల పై కేసులు నమోదు చేయడమైనది. ఈ ఆపరేషన్ లో ఆత్మకూరు సీఐ ఎమ్.నాగభూషణ్ గారి ఆధ్వర్యంలో ఆత్మకూరు సెబ్ సిఐ నాయుడు మరియు వారి సిబ్బంది , ఆత్మకూరు ఎస్ ఐ లు కృష్ణమూర్తి, నారాయణ రెడ్డి, వెలుగోడు ఎస్ ఐ ప్రసాద్, పాములపాడు ఎస్ ఐ అశోక్,కొత్తపల్లి ఎస్ ఐ హుస్సేన్ బాషా మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.నాటుసారాయి బట్టీల పైన మరియు చట్ట వ్యతిరేక కార్యకలపాల మీద గట్టి నిఘా ఉంచడం జరుగుతుంది.ఎవరైనా సారాయి తయారు చేసినా,అమ్మినా కఠిన చర్యలు తప్పవని,ఈ వృత్తి మానుకోని వ్యక్తులపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేసి మరియు పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపబడును అని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావ్ హెచ్చరించారు.

## మల్లన్న ఆలయంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు..




విభారె న్యూస్ జనవరి 13 శ్రీశైలం.మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నిక దీక్షతో ఏడు రోజులపాటు నిర్వహింపబడే సంక్రాంతి బ్రహ్మోత్సవాలు రెండవ నాడైన శనివారం (13.01.2024) శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు జరిపించబడ్డాయి.ఉత్సవాలలో భాగంగానే యాగశాల యందు శ్రీ చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం లోక కల్యాణంకోసం చతుర్వేద పారాయణలు, జపాలు,రుద్ర పారాయణ చేయడం జరిగింది .తరువాత మండపారాధనలు, పంచావరణార్చనలు, రుద్రహో మం కార్యక్రమాలు ఆగమశాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి.అదే విధంగా శనివారం సాయంకాలం ప్రదోష కాలపూజలను, హోమాల ను జరిపించిన తరువాత జపానుష్టానాలు జరిపించబడ్డాయి. భృంగివాహన సేవఈ బ్రహ్మోత్స వాలలో నిర్వహించబడే వాహన సేవలలో భాగంగా శనివారం సాయంకాలం శ్రీ స్వామి అమ్మవార్లకు భృంగివాహనసేవ జరిపించబడ్డాయి.ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో భృంగివాహనంపై వేంచేపు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించబడ్డాయి తరువాత పురవీధులలో గ్రామోత్సవం జరిపించబడినది. గ్రామోత్సవములో జానపద కళారూపాల ప్రదర్శన, కోలాటం తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేయబడింది.నేటి కార్యక్రమాలు: ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈరోజు (14.01.2024) శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు, చండీశ్వరపూజ, మండపారాధనలు, పంచావరణార్చనలు, జపానుష్టానాలు, రుద్రహోమం, సాయంకాలం నిత్యహవనాలు,బలిహరణలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించబడతాయి.ఈ ఉత్సవాలలో భాగంగా నేటి సాయంకాలం శ్రీ స్వామిఅమ్మవార్లకు రావణవాహనసేవ గ్రామోత్సవం జరిపించబడుతుంది.

## పట్టణంలో అభివృద్ధి పనులు ప్రారంభం.. ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 13-నంద్యాల పట్టణంలోని 13వ వార్డులో 26లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజ్ లు, అలాగే 14వ వార్డులో 35 లక్షలతో డ్రైనేజ్ లను శనివారం ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి. ఎమ్మెల్సీ ఇషాక్ బాషా,మున్సిపల్ చైర్ పర్సన్ మభూన్నిసా, కౌన్సిలర్స్ విమలమ్మ, కాల్వ సరస్వతి, వార్డు ఇన్చార్జిలు సోమశేఖర్ రెడ్డి, నాగరాజు చేతులమీదుగా ఘనంగా ప్రారంభించారు.. అదేవిధంగా 14వ వార్డులో మరో45 లక్షలతో డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి పనులు వేగవంతంగా చేపడుతున్నామని అన్నారు , వాటి పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు డ్రైనేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి ,మున్సిపల్ వైస్ చైర్మన్ లు గంగిశెట్టి శ్రీధర్, పంషావలి, రామసుబ్బయ్య, ప్రసాద్ అయ్యా, నాగరాజు, 13వ వార్డు వైసిపి నాయకులు టివై శివయ్య ,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చక్రవర్తి, సత్యమయ్య, గేలివి రామకృష్ణ ,మురళి తదితరులు పాల్గొన్నారు..

## ఆర్ టీ ఏ శాఖ అధికారులమని చెప్పి.



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 13--నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం చింతకుంట గ్రామం సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద ఆర్ టీ ఏ శాఖ అధికారులమని చెప్పి వాహనదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్న ముఠాను శనివారం టౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి అరెస్టు చేశారు. స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్లో ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆళ్లగడ్డకు చెందిన విల్సన్ కుమార్, దూదేకుల ఉసేనయ్య, చిన్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తులను అరెస్టు చేసి ఒక కారును, 2,200/- రూ. నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసలు అయి డబ్బుల కోసం మోసం చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్ హుస్సేని, కానిస్టేబుల్ ఉదయ్ మునీశ్వర్, హోంగార్డులు ప్రసాద్,ఓబులేసు, రుద్రుడు లను డీఎస్పీ వెంకటరామయ్య అభినందించారు. మీడియా సమావేశంలో టౌన్ రమేష్ బాబు, టౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# కర్నూలులో త్వరలో ముస్లిం మైనార్టీల గర్జన

**మైనార్టీల హక్కుల సాధనకు నిరంతర పోరాటం**

**అన్యాక్రాంతమైన ఆస్తుల పరిరక్షణకు చర్యలు**

**చట్టసభల్లో ముస్లిం మైనారిటీలకు సముచిత స్థానం కల్పించాలి**

**ముస్లింలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి**

**డాక్టర్ షేక్ మహబూబ్ బాషా,ఎస్ఎంబి ఫౌండేషన్ వ్యవస్థాపకులు**



కర్నూలు:విభారె ప్రతినిధి:ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం త్వరలో కర్నూలు నగరంలోని ఎస్టీ,బీసీ కళాశాలలో ముస్లిం,మైనార్టీల గర్జన నిర్వహిస్తున్నట్లు ఎస్ఎంబి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ షేక్ మహబూబ్ బాషా వెల్లడించారు. శనివారం ఆంధ్ర అక్షర దినపత్రిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం,మైనార్టీ హక్కులకు భంగం కలుగుతోందని, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేసే ప్రత్యేక కమిటీని త్వరలో నియమిస్తున్నట్లు తెలిపారు.అలాగే అన్యాయక్రాంతం అవుతున్న ముస్లిం, మైనార్టీ ఆస్తుల పరిరక్షణకు పోరాటం సాగించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చట్టసభల్లో ముస్లిం మైనారిటీలకు సాముచిత స్థాన కల్పించాల్సి ఉందని ముస్లిం మైనార్టీలకు పార్టీ టికెట్లు కేటాయించే పార్టీలకే పార్టీలకతీతంగా మద్దతు ఇస్తున్నట్లు షేక్ మహబూబ్ బాషా తెలిపారు, కర్నూలు జిల్లాలో సుమారు 25వేల ఎకరాల ముస్లిం మైనారిటీ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయన్నారు.అనేకమంది ముస్లిం, మైనారిటీలకు ఎలాంటి స్థలం కూడా లేక చాలా దీనావస్థలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పార్టీలకు అతీతంగా కర్నూలు నగరంలోని ఎస్టీ,బీసీ కళాశాల మైదానంలో త్వరలో రాష్ట్రస్థాయి ముస్లిం మైనార్టీ గర్జన నిర్వహించి,తమ హక్కులను కాపాడుకునేందుకు పోరాటం సాగిస్తామన్నారు.ముస్లిం,మైనారిటీ నాయకులు రిటైర్డ్ తహసిల్దార్ రోషనాలి మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయన్నారు.ముఖ్యంగా సంక్షేమం కోసం ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి నిధులు ఖర్చు చేయడం లేదని ఆరోపించారు, యువతకు ఉపాధి అవకాశాలు లేవని అన్నారు.దాతలు ఇచ్చిన భూములు కూడా కొంతమంది పెత్తందారులు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు.బడుగు, బలహీన వర్గాలలో ముస్లిం మైనారిటీలు అనేకమంది అత్యంత దయనీయ స్థితిలో జీవిస్తున్నారని అన్నారు.గతంలో ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని వారి సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసిందన్నారు.ప్రస్తుత ప్రభుత్వం ఉన్నత విద్య కోసం రాష్ట్రవ్యాప్తంగా 9మంది విద్యార్థులకు విదేశీ చదువుల కోసం నిధులు మంజూరు కాగా అందులో ఇద్దరికీ మాత్రం కర్నూలు జిల్లా నుండి విద్యార్థులు ఎంపిక కావడం చూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ముస్లిం మైనార్టీల పట్ల ఏమాత్రం శ్రద్ధ ఉందో స్పష్టమవుతుంది అన్నారు.ఫీజు రీయింబర్స్మెంట్ కోసం కేటాయిస్తున్న మొత్తం కూడా చాలా తక్కువగా ఉందన్నారు.1921,జూన్,8వ తేదీ జరిగిన క్యాబినెట్ సమావేశం ముస్లిం మైనారిటీల సంక్షేమ కోసం అనేక తీర్మానాలు చేసినప్పటికీ ఇంతవరకు అమలు కాలేదని ఆవేదన చెందారు. బోర్డుకు ఇంతవరకు సిబ్బంది లేదన్నారు. ఉర్దూ అరబిక్ స్కూలు కనిపించడం లేదన్నారు.కేంద్ర ప్రభుత్వం రూ.400కోట్లు రాష్ట్రానికి విడుదల చేసిందని,అందులో నిధులు ఏమయ్యాయో తెలియడం లేదన్నారు.దీనిపై స్థానిక నాయకులు, అధికారులపై అనుమానం ఉందని, ప్రభుత్వం విచారించి బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ముస్లిం మైనారిటీల ఉద్యోగ కల్పనకు టెక్స్ టైల్ పార్కు కావాలని తాము డిమాండ్ చేశామని,అయితే దీనిపై ఓ నాయకుడు చేసిన వ్యాఖ్యలు తమను ఎంతగానో బాధిస్తున్నాయన్నారు.ఎన్నికల సమీపిస్తుండడంతో మంత్రులు,ఎమ్మెల్యేలు,పలువురు నాయకులు వారి కుటుంబ సభ్యులే లబ్ధి పొందుతున్నారు గాని,సామాన్యమైన ముస్లిం మైనారిటీ గురించి పట్టించుకోవడం లేదన్నారు.15సూత్రాల పథకం అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందన్నారు.లా అండ్ ఆర్డర్ విషయంలో కూడా ముస్లిం మైనారిటీలకు అన్యాయం జరుగుతుందన్నారు.ఈ విషయంలో కొందరు స్థానికులే అడ్డుపడుతున్నారని, ముస్లిం మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాలలో రోడ్లు,డ్రైనేజీ,మంచినీరు సౌకర్యం కల్పించడం లేదన్నారు. నాలుగు శాతం రిజర్వేషన్ కూడా ఎవరికిచ్చారు తెలియడం లేదన్నారు. అలాగే సబ్ ప్లాన్ అమలులో కూడా ఎలాంటి నిధులు కేటాయించడం లేదన్నారు.ప్రస్తుత ప్రభుత్వంలో అనేక తోఫాలు కూడా రద్దు చేశారన్నారు.ముస్లిం మైనార్టీలను వచ్చే ఎన్నికలలో తగిన బుద్ధి చెబుతామన్నారు.ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేసిన పార్టీలకు ఆ సామాజిక వర్గం తగిన బుద్ధి చెప్పిందన్నారు.అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ లో కూడా జరుగుతుందన్నారు.డైమండ్ అస్లాం భాష మాట్లాడుతూ హిందువులకు తాము వ్యతిరేకం కాదని,హిందువుల హక్కులను కాపాడుకున్నట్లుగానే తాము కూడా తమ హక్కుల సాధన కోసం పోరాడుతున్నామన్నారు.ముస్లింలలో అనేకమంది నవాబులు ఉన్నారు.ఫకీర్లు కూడా ఉన్నారు.తమ సామాజికవర్గానికి ఇతర సామాజిక వర్గాలు కూడా మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.మాజీ వర్క్ బోర్డు చైర్మన్ భాష మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలకు మేలు చేసేవారిని ఎన్నుకుంటామన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనారిటీలకు ఎన్ని పార్లమెంటు స్థానాలు,ఎన్ని అసెంబ్లీ స్థానాలు కావాలన్న దానిపై వివిధ పార్టీలకు ప్రధానంగా టిడిపి,వైసిపి పార్టీలకు నివేదిక అందజేస్తామన్నారు.ముస్లిం మైనార్టీలకు సహకరించే పార్టీకే తాము ఎన్నికల్లో సహకరిస్తామని ఆయన అన్నారు.కర్నూలు నగరంలోని రాజ విహార్, వక్ఫ్ బోర్డు కాంప్లెక్స్ లో గతంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని, ప్రస్తుతం వాడికి సంబంధించిన వివరాలు తెలపడంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.వివరాలు కావాలని కోరితే ఎలాంటి అభివృద్ధి సమాచారం లేని 1250పేజీల నివేదికను అందజేస్తున్నారని ఆయన విమర్శించారు.ముస్లిం మైనార్టీలకు సహకరించే వారికే తమ సామాజిక వర్గం మద్దతిస్తుందని ఆయన తెలిపారు.

# నీటి కష్టాలు... తప్పవా



విజయవాడ, జనవరి 13,రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులన్నీ ఖాళీ అయ్యాయి. గత ఏడాది వర్షాభావ పరిస్థితులకు తోడు వచ్చిన నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోకపోవడంతో జనవరిలోనే ప్రాజెక్టుల్లోని నీటిమట్టాలన్నీ ప్రమాదకర పరిస్థితుల్లోకి పడిపోయాయి. జనవరిలోనే ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు అడుగంటి పోతే జూలైదాకా తాగునీటి అవసరాల సమస్య పరిష్కారం ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. శ్రీశైలం ప్రాజెక్టులో నీరు ఇప్పటికే డెడ్‌స్టోరేజ్ స్థాయికి చేరువయ్యాయి. ప్రస్తుతం శ్రీశైలంలో కేవలం 47.6 టిఎంసిలు మాత్రమే వున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 84.28 టిఎంసిలు వుండేవి. తుంగభద్ర డ్యామ్‌లో గత ఏడాది 67.75 టిఎంసిలు వుండగా, ప్రస్తుతం కేవలం 10.21 టిఎంసిలు వున్నాయి. నాగార్జునసాగర్‌లో గత ఏడాది 273.27 టిఎంసిలు వుండగా, ఈ ఏడాది కేవలం 154 టిఎంసిలు ఉన్నాయి. పులిచింతల ప్రాజెక్టులో గత ఏడాది 44.2 టిఎంసిలు వుంటే ఈ ఏడాది కేవలం 12.45 టిఎంసిలు మాత్రమే వున్నాయి. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో గత ఏడాది 12.94 టిఎంసిలు వుండగా, ఈ ఏడాది కేవలం 2.62 టిఎంసిలు మాత్రమే వున్నాయి. సోమశిల ప్రాజెక్టులో గత ఏడాది 71.90 టిఎంసిలు వుంటే ఇపుడు 31.2 టిఎంసిలు మాత్రమే వున్నాయి. కండలేరు రిజర్వాయర్‌లో గత 52.5 టిఎంసిలు వుంటే ప్రస్తుతం 12.8 టిఎంసిలు మాత్రమే వున్నాయి. ఇలా రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్‌లలో నీటి నిల్వలు జనవరినాటికే అడుగంటిపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా వున్న కృష్ణా, గోదావరి, పెన్నా నదిపై వున్న మొత్తం ప్రాజెక్టుల నీటి సామర్థ్యం 870 టిఎంసిలుకాగా, ఈ ఏడాది కేవలం 289 టిఎంసిలు మాత్రమే వుంది. ఇందులో నాగార్జునసాగర్‌లో డెడ్ స్టోరేజ్ నీటి నీటి నిల్వ 130 టిఎంసిలు, శ్రీశైలంలోని 35 టిఎంసిలతోపాటు ఇతర ప్రాజెక్టుల్లోని డెడ్‌స్టోరేజ్ నీటి మట్టాలను తీసివేస్తే రాష్ట్ర అవసరాల కోసం వినియోగించుకునే నీటినిల్వలు చాలా తక్కువ. ఇపుడున్న కొద్దిపాటి నిల్వలను అయినా జాగ్రత్తగా వాడకపోతే తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితి వుంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల ముందుకువికసిత్ భారత్ సంకల్ప యాత్రలో బిజెపి నాయకులు సోముల ప్రకాష్ నాయుడు, సుదర్శన్





ముదిగుబ్బ జనవరి 13 )వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి విచ్చేసిన వాహనానికి పొద రాళ్లపల్లి, మంగళమడక గ్రామంలో గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న డిస్టిక్ జనరల్ సెక్రెటరీ సుదర్శన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సోముల ప్రకాష్ నాయుడు, కోఆర్డినేటర్ ఓబులేసు, మండల స్థాయి అధికారులు వీకసిత్ భారత్ సంకల్పయాత్ర అధికారులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల స్థాయి అధికారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక పథకాల గురించి వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వము రాష్ట్రంలో దేశంలో 17 పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు వారి అభివృద్ధిని కోరుకునే విధంగా అందుబాటులో ఉండే ఈ కార్యక్రమాల ద్వారా గ్రామ అభివృద్ధి తో పాటు దేశ అభివృద్ధి జరగాలన్న మొక్క ఉద్దేశంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వం పథకాలను వివరిస్తూ ఇంకా ఎవరైనా అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకో లేకపోతే ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగటికి తీసుకెళ్లి సంబంధించిన అధికారుల ద్వారా కార్యక్రమాలను ప్రజలకు అందే విధంగా చూడాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ప్రజలకు అధికారులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది అగ్రికల్చర్ మండల అధికారులు లక్ష్మీ నరసింహులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది మండల వైద్యాధికారి, బ్యాంకు సిబ్బంది సర్పంచ్ నాగేష్, సచివాలయ ఉద్యోగులు, సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్లు గుట్ట గోపాల్, మునిరాజ్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ నారాయణస్వామి ఆలయ నిర్మాణానికి. రూ.10 వేలు విరాళం

ఎన్ పి కుంట సత్య సాయి జిల్లానంబుల పూలకుంట మండల కేంద్రంలోని నడిమి బోటు కొండపై నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వైకుంఠ నారాయణ స్వామి ఆలయం అభివృద్ధికి శనివారం పెడబల్లి గ్రామానికి ప్రముఖ పారిశ్రామికవేత్త హరీష్ రెడ్డి రూ.10 వేలను విరాళంగా అందజేశారు. వైకుంఠ నారాయణస్వామి ఆలయ నిర్మాణానికి వైకుంఠ నారాయణస్వామి సేవా ట్రస్టు సభ్యులు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని పెడబల్లి గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త హరీష్ రెడ్డి రూ.10వేలు విరాళం అందజేసి, ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని ప్రముఖ పారిశ్రామికవేత్త హరీష్ రెడ్డి తెలియచేసినట్లు వైకుంఠ నారాయణస్వామి సేవా ట్రస్ట్ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించబోతున్న వైకుంఠ నారాయణస్వామి ఆలయం నిర్మాణానికి వివిధ గ్రామాల పెద్దలు, రైతులు,నాయకులు మండల వాసులు ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేయాలని వైకుంఠ నారాయణస్వామి సేవా ట్రస్ట్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి, శంకర్ రెడ్డి, విశ్వనాథరెడ్డి వైకుంఠ నారాయణస్వామి సేవా ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

## యువకుడికి గాయాలు

విజయవాడ,ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగిఉన్న కంటైనర్ లారీని బుల్లెట్ బండి ఢీకొట్టింది. ఘటనలో ఒక యువతి అక్కడిక్కడే మృతి చెందింది. సంక్రాంతి పండుగ సెలవులు సందర్భంగా ఇద్దరు యువతీ యువకులు హైదరాబాద్ నుంచి కోనసీమ జిల్లా రామచంద్రపురం కు బుల్లెట్ పై వెళ్తున్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ సమీపంలో అగిఉన్న భారీ కంటైనర్ అంచున బుల్లెట్ ఢీకొంది. దీంతో బుల్లెట్ పై ప్రయాణం చేస్తున్న బొప్పన చాందిని (25) అనే యువతి అక్కడిక్కడే మృతి చెందగా,యువకుడు గాయపడ్డాడు. సమాచారం అందుకుని ప్రమాద స్థలానికి చేరుకున్న ఆత్కూరు పోలీసులు. వివరాలు సేకరిస్తున్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది జాతీయ రహదారిపై ట్రాఫిక్ క్లియర్ చేశారు.

# నకిలీ ఆర్టీయే ముఠా అరెస్టు

నంద్యాల,నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం చింతకుంట గ్రామం సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద ఆర్టీయే శాఖ అధికారులమని చెప్పి వాహనదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్న ముఠాను శనివారం టౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి అరెస్టు చేశారు. స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్లో డీఎస్పీ వెంకటరామయ్య మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆళ్లగడ్డకు చెందిన విల్సన్ కుమార్, దూదేకుల ఉసేనయ్య, చిన్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తులను అరెస్టు చేసి ఒక కారును, 2,200/- రూ. నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసలు అయి డబ్బుల కోసం మోసం చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్ హుస్సేని, కానిస్టేబుల్ ఉదయ్, మునీశ్వర్, హోంగార్డులు ప్రసాద్, ఓబులేసు, రుద్రుడు లను డీఎస్పీ వెంకటరామయ్య అభినందించారు. మీడియా సమావేశంలో టౌన్ సిఐ రమేష్ బాబు, టౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు

# భోగభాగ్యాలనిచ్చే పండుగ భోగి



భోగి లేదా భోగి పండుగ అనునది తెలుగు వాళ్ళు జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ. మనం పెద్ద పండుగగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటిరోజును భోగి అంటారు. భోగి పండుగ సాధారణంగా జనవరి 13 లేదా జనవరి 14 తేదిలలో వస్తుంది. దక్షిణాయనంలో సూర్యుడు రోజు రోజుకి భూమికి దక్షిణం వైపుగా కొద్ది కొద్దిగా దూరమవుతూ దక్షిణ అర్ధగోళంలో భూమికి దూరం అవుట వలన భూమిపై బాగా చలి పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగ భగ మండే చలి మంటలు వేసుకునేవారు, ఉత్తరాయణం ముందురోజుకి చలి విపరీతంగా పెరగడం ఈ చలిని తట్టుకునేందుకు భగ భగ మండే మంటలు అందరు వేయటం వలన ఈ రోజుకు భోగి అనే పేరు వచ్చింది. సంక్రమణ మహాపర్వానికి ముందు రోజుకి ఒక ప్రాధాన్యం ఉంది. దీనికి భోగిపర్వం అని పేరు. అయితే భోగము అనే మాటకు అర్థం ఏమిటంటే అనుభవము అని. ఆనందంగా దేనిని అనుభవిస్తామో లేదా దేనిని అనుభవించడం వల్ల ఆనందం పొందుతామో దానిని భోగము అనాలి. అలాంటి భోగములు అనుభవించవల సిన రోజుని భోగి అంటారు. నిజమైన ఆనందాన్ని అనుభవించడమే నిజమైన భోగం. ఒక్కొక్కరికి ఒక్కొక్కటి ఆనందం. సామాన్యుల ఆనందాలు వేరు. వాళ్ళకి లౌకిక విషయాలు దొరికితే అది భోగం. ఆ విషయంతో విసుగు కలిగితే మరో విషయం లభించాలని. కానీ ఏది లభిస్తే మరి ఇంకేదీ కావాలని అనిపించదో, ఏది పరిపూర్ణమైన ఆనందమో అదే నిజమైన భోగం. అలాంటి భోగం యోగం వల్లనే లభ్యం అవుతుంది. అందుకే యోగులే భోగులు కాగలరు. అలాంటి దివ్య భోగం ఈరోజున అమ్మ గోదాదేవి ఆండాళ్ళమ్మ పొందినది. అదేమిటంటే పరమాత్మ ప్రాప్తి. రంగనాథుని చేపట్టినది. రంగనాథుని అనుగ్రహాన్ని పొందినది. రంగనాథుని సాంగత్యం అనబడేట టువంటి ఆ కైవల్యానందం అనే భోగాన్ని అమ్మ పొందినది కనుక ఈరోజు భోగి అనే పేరు భక్తి సాంప్రదాయం పరంగా నిర్వచించేవారు చెబుతారు. సరిగ్గా ఈ రోజుతో ధనుర్మాసం పూర్తి అవుతు న్నది. తర్వాత నుంచి మకర మాసం వస్తున్నది సౌరమానం ప్రకారంగా. ఈ ధనుర్మాస వ్రతమంతా ఈరోజు పూర్తీ జరిగి దాని ఫలితంగా అమ్మవారు స్వామియొక్క అనుగ్రహాన్ని పొందినది. చలికాలంలో అత్యంత చలిగా ఉండే రోజు భోగి. ఈ రోజున ఆంధ్రులు మంటలు వేసి చలికాచుకుం టారు, ఈ మంటలనే భోగి మంటలు అంటారు. భోగిమంటలకు ఎక్కువగా తాటిఆకులను ఉపయోగిస్తారు. ఈ ఆకులను భోగికి కొన్ని రోజుల ముందే కొట్టుకొని తెచ్చి భోగిమంటల కొరకు సిద్ధం చేసుకుంటారు. అనేక ప్రాంతాలలో ప్రత్యేకంగా భోగిమంటల కొరకు తాటాకు మోపులను ఇళ్ళవద్దకే తెచ్చి విక్రయిస్తున్నారు. వీటితో పాటు మంటలలో మండగల పనికిరాని పాత వస్తువులను ముందురోజు రాత్రికి సిద్ధం చేసుకుంటారు. తెల్లవారుజామున సాధారణంగా 3 గంటల నుంచి 5 గంటల మధ్యన ఎవరి ఇంటి ముందువారు ఈ మంటలు వేయడం ప్రారంభిస్తారు. ఈ పండుగనాడు తెలుగు ప్రాంతాలలో కొందరు కొత్తబట్టలు ధరించడం ఒక సంప్రదాయంగా ఉంది. తెల్లవారుజామున భోగిమంటల వద్ద చలికాచుకున్న చిన్నా పెద్దలు భోగిమంటల సెగతో కాచుకున్న వేడినీటితో లేదా మామూలు నీటితో తలస్నానం చేసి కొత్తబట్టలు ధరిస్తారు.పండుగ నెలలో ముగ్గులు ప్రతిరోజు వేస్తారు, కాని భోగి రోజు ముగ్గు ఒక ప్రత్యేకత, ముగ్గువేసే వారికి ఇష్టం కూడిన మరింత కష్టం, సాధారణంగా ముగ్గు వేసే చోటనే భోగి మంటలు వేస్తారు, భోగి మంటల వలన చాలా కసువు తయారవుతుంది. ఆ కసువు అంతా పారబోసి కడిగి ముగ్గువేయడం కొంచెం కష్టంతో కూడుకొన్నప్పటికి ఇష్టమైన పనులు కాబట్టి చాలా ఆనందంగా చేస్తారు, రోజు వేసే ముగ్గుల కన్నా ఈ రోజు మరింత అందంగా రంగు రంగుల రంగవల్లికలేస్తారు. భోగి పండుగ రోజు పిల్లలపై రేగు పండ్లు పోసి ఆశీర్వదిస్తారు, అందుచేత ఈ పళ్ళను భోగి పళ్ళు అంటారు, భోగి పళ్ళ ఆశీర్వాదాన్నీ శ్రీమన్నారాయణుడి ఆశీస్సులుగా భావిస్తారు. కొన్ని ప్రాంతాలలో భోగి రోజున రైతులు తమ సాగుభూమికి ఆనవాయితీగా కొంతమేర సాగునీరు పారించి తడి చేస్తారు, ఒక పంట పూర్తయిన తదుపరి మళ్ళీ పంట కొరకు సాగుభూమిలో నీరు పారించడాన్ని పులకేయడం అంటారు, ఆనవాయితీగా భోగి రోజున పులకేయడాన్ని భోగి పులక అంటారు. గోదావరి జిల్లాల్లో ప్రాం తాల్లో భోగి రోజున కోడి పందాలు వేయడం ఒక ఆనవాయితీగా వస్తుంది, పౌరుషానికి ప్రతీకగా ఉండే కోళ్లు పోటీలో ప్రాణాలను పణ్ణంగా పెట్టి పోరాడుతాయి, ఈ పోటీలను చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారు. పోటీలో పాల్గొనే కోళ్లపై పందాలు కాస్తారు. తాహత్తుకు మించి మితిమీరిన పందాలు కాయ డం వలన కలిగే అనర్థాల వలన పందాలు కాయడంపై నిషేధాంక్షలు ఉన్నాయి. భోగి రోజున పిల్లలు చాలా ఆనందంగా గాలిపటాలు ఎగుర వేస్తారు, వివిధ రకాల గాలిపటాలు తయారు చేసి లేదా కొనుక్కొని ఎగరవేయడంలో పోటీపడతారు. భోగి రోజు దాదాపు విద్యార్థులంద రికి సెలవు ఉంటుంది, వేరువేరు ప్రాంతాలకు చదువుల కోసం వెళ్ళిన విద్యార్థులు భోగికి ముందే తమ స్వంత ఊరు చేరుకుంటారు. సంక్రాం తి పండుగ దినాలలో ఊర్లలో ఆనందం ఇంత అంత కాదు.

# సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజే మకర సంక్రాంతి




సంక్రాంతి అనగా నూతన క్రాంతి . సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారు.అయితే ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారు. అయితే మనకు పన్నెండు రాశులు ఉన్నాయి.ఆ పన్నెండు రాశులలోకి సూర్యుడు ప్రవేశించే క్రమంలో మనకు పన్నెండు సంక్రాంతులు వస్తాయి.సూర్య సంక్రమణం జరిగేటపుడు సూర్యుడు ఏ రాశిలో ఉంటే ఆ సంక్రాంతి అంటారు. ఇలా ప్రతి మాసం ఒక సంక్రాంతి ఉంటుంది.సౌరమాన కాలెండరులో ప్రతినెల ఒక సంక్రాంతితో ప్రారంభమవుతుంది ఈ పండుగను పెద్ద పండుగగా ఆంధ్రులు జరుపుకుంటారు. సంక్రాంతిని మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా చేసుకుంటారు. మొదటి రోజు భోగి, రెండవ రోజు మకర సంక్రాంతి, మూడవ రోజు కనుమ. కొన్ని ప్రాంతాలలో నాలగవ రోజు ముక్కనుమగా జరుపుకుంటారు. ఈ మూడు రోజులలో మొదటి రోజు భోగిమంటలతో, రెండవ రోజు పొంగలి, పిండివంటలతో, పితృ దేవతల, దేవుళ్ళ పూజలతో, మూడవ రోజు గో పూజలతో అలాగే మాంసప్రియులకు మంచి కూరలతో, మూడురోజుల పండుగ ఎంతో ఆనందంగా కొనసాగుతుంది. ఉత్తరాయణం సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే కాలమే మకర సంక్రమణము. మకర సంక్రమణము నుండి ఉత్తరాయణ పుణ్యకాలము ప్రారంభము అవుతుంది. ఆ తరువాత కుంభ, మీన, మేష,వృషభ, మిథున రాశులలో కొనసాగినంత కాలము ఉత్తరాయణము. శారీరక పరిశ్రమకు, పూజలకు, సాధనలకు, కృషికి అనువైన, ఆవశ్యకత ఉన్న కాలము ఉత్తరాయనము. కర్కాటక రాశిలోకి సూర్యుడు ప్రవేశించిన దగ్గరినుండి మొదలై, ఆ తరువాతసింహ, కన్య, తుల, వృశ్చికం, ధనూ రాశులలో కొనసాగినంత కాలము దక్షిణాయణము. మానసికమైన అర్చనకు,ధ్యానానికీ,యోగానికీ, దీక్షలకు,బ్రహ్మచర్యానికి, నియమ నిష్టలకు అనువైన, ఆవశ్యకత ఉన్న కాలము దక్షిణాయణము. పన్నెండు నెలల సంవత్సర కాలములో ఆరు నెలల దక్షిణాయణము దేవతలకు ఒక రాత్రి, ఆరు నెలల ఉత్తరాయణము దేవతలకు ఒక పగలు. కనుక దేవతలు మేలుకునే కాలము ఉత్తరాయణ పుణ్య కాలము. కనుకనే ఉత్తరాయనము వరకూ ఎదురు చూసి ఉత్తరాయణము ప్రవేశించిన తర్వాత తనువును చాలించాడు మహానుభావుడైన భీష్ముడు."సంక్రాంతి" లేదా "సంక్రమణం" అంటే చేరుట అని అర్థం. జయసింహ కల్పద్రుమం అనే గ్రంథంలో "సంక్రాంతి"ని ఇలా విర్వచించారు – తత్ర మేషాదిషు ద్వాదశ రాశి క్రమణేషు సంచరతః సూర్యస్య పూర్వస్మాద్రాశే ఉత్తరః రాశౌ సంక్రమణ ప్రవేశః సంక్రాంతిః – మేషం మొదలైన 12 రాశులలో సంచరించే సూర్యుడు ముందున్న రాశి నుండి తరువాతి రాశిలోనికి ప్రవేశించడమే సంక్రాంతి.సూర్యుని చలనంలో (రథయాత్రలో) ఘట్టాలు నాలుగు. అవి మేష, తుల, కటక, మకర సంక్రమణాలు. వీటిలో మకర సంక్రమణాన్ని "సంక్రాంతి పండుగ"గా వ్యవహరిస్తారు.మార్గశిరం పూర్తి కాగానే ఉత్తరాయణం మొదలవుతుంది.సూర్యుడి చుట్టూ భూమి పరిభ్రమించే మార్పు క్రమంలో తన చుట్టూ తాను కూడా తిరుగుతుంది.అందువలన సూర్యుడు ఆరు నెలలు ఉత్తరం వైపు ఆరు నెలలు దక్షిణం వైపు కనిపిస్తాడు.ఇలా ఉత్తరం వైపు కనిపించే క్రమమే ఉత్తరాయణం అంటారు.దక్షిణం వైపు కనిపించే క్రమం దక్షిణాయనం. మనకు ఒక సంవత్సరం కాలము అయితే దేవుళ్ళకు ఒక రోజు. అయితే ఒక రోజులో పగలు అనేది ఉత్తరాయణం. రాత్రి అనేది దక్షిణాయణం.. ఈ ఉత్తరాయణమనేది అందుకే మనకు అంత ముఖ్యం.. ఈ రోజు కోసమే భీష్ముడు ఎదురుచూసి ఉత్తరాయణ పుణ్య ఘడియలలోనే పరమపదించారు.మకర సంక్రాంతి : సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజును మకర సంక్రాంతి అంటారు. ఇది ఆరు నెలలు ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభ దినం. సాంప్రదాయకంగా భారతదేశ కాలెండరు ప్రకారం ప్రతి సంవత్సరం సుమారు జనవరి 14 లేదా జనవరి 15 వ తేదీలలో వస్తుంది.మహా వైషువ సంక్రాంతి : ఇవి రెండు ఋతువుల మధ్య వచ్చే సంధి కాలం. మొదటిది శీతాకాలం, వేసవి కాలం మధ్య వచ్చే సంధి కాల ప్రారంభం – మేష సంక్రాంతి (వసంతఋతువులో వచ్చేది), వేసవి కాలం, వర్షాకాలముల మధ్య వచ్చే సంధి కాలం – తుల సంక్రాంతి (శరత్ ఋతువులో వచ్చేది). సంవత్సరం మొత్తంలో ఈ రెండు రోజులు కచ్చితంగా పగలు రేయి సమానంగా ఉంటాయి.అంటే సూర్యో దయం, సూర్యాస్తమయాలు దాదాపు ఒకే సమయమున సంభవి స్తాయన్నమాట. ఈ సంక్రాంతి ఒరియా నూతన సంవత్సరం గానూ, బెంగాలీ కాలెండరులో ఆఖరి దినంగానూ నిర్వహిస్తారు. భారతదేశం లోని అనేక ప్రాంతాలలో ఈ రోజును వైశాఖిగా వ్యవహరిస్తారు .విష్ణు పది సంక్రాంతి చంద్రమాన కాలెండరులో పుష్యమాస మొదటి రోజు. దక్షిణాన భూటాన్, నేపాల్ లలో దీనిని వైల్డ్ దుంపలు (తరుల్) తినే పండగగా జరుపుతారు.కర్కాటక సంక్రాంతి : జూలై 16, న సూర్యుడు కర్కాటక రాశిలో ప్రవేశిస్తుంది. ఈ దినాన్ని కర్కాటక సంక్రాతిగా వ్యవహరిస్తారు. ఈ దినం ఉత్తరాయణ పుణ్యకా లానికి ఆఖరి దినంగా హిందూ కాలెండరులో వ్యవహరిస్తారు. ఈ రోజు దక్షిణాయణ పుణ్యకాలానికి మొదటి రోజు.



# ఉరి వేసుకొని యువకుడు మృతి

కోసిగి, జనవరి 13 (విభారె న్యూస్) కోసిగి మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో కురువ రంగన్న కురువ హనుమంతమ్మ వారి ఏకైక కుమారుడు కురువ ముత్తన్న(32) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పూనుకున్నాడు కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు మృతుడు ముత్తన్నకు ఆర్లబండ గ్రామానికి చెందిన కురువ కార్లింగ, కాలమ్మ దంపతుల కుమార్తె కురువ లక్ష్మి తో 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగినట్లు తెలిపారు. అయితే ఇప్పటి వరకు వీరికి సంతానం కూడా కలుగలేదని తెలిపారు. అయితే కొద్దికాలంగా మృతుని భార్య కురవ లక్ష్మి ముత్తన్నతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయిందని అప్పటినుండి తాగుడుకు బానిసై నిత్యం తాగుతూ ఉండేవాడని తెలిపారు. అయితే అమ్మాయి తల్లిదండ్రులు మద్యం సేవించి కూతురు లక్ష్మిని వేధిస్తూ ఉన్నాడని గతంలో పోలీస్ స్టేషన్లో గత కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే నిన్నటి దినము



అనగా శుక్రవారం ఉదయం పోలీసులు గ్రామానికి వెళ్లి ముత్తన్న బైక్ పై ఎక్కించుకొని పోలీస్ స్టేషన్ తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు తిరిగి పోలీసులు ముత్తన్నాను రాత్రి గ్రామానికి తీసుకొచ్చి వదిలినట్లు తెలిసింది దీనితో రాత్రి ఏమిజరిగిందో ఏమో తెలియదు కాని ఉరివేసుకుని చనిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసుకొని పోస్ట్ మార్టం నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు.

# అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి..

## కోటి సంతకాల సేకరణను ప్రారంభించిన అంగన్వాడీలు.

విభారె న్యూస్ ఎమ్మిగనూరు జనవరి 13. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పట్టణ మండల నాయకులు నాగలక్ష్మి శైలజ నీరజ మల్లేశ్వరి సిఐటియు డివిజన్ కార్యదర్శి బి రాముడు ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి తిమ్మ గురుడు డిమాండ్ చేశారు. శనివారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరింది. సమ్మె శిబిరం నుండి స్థానిక సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి సర్కిల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జర్నలిస్ట్ యూనియన్ నాయకులు వి దేవేంద్ర మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని తాము గొంతెమ్మ కోరికలు కోరడం లేదని వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు ఇచ్చిన హామీ మేరకే డిమాండ్ చేస్తున్నామన్నారు.



సంతకాలు సేకరించిన అంగన్వాడీలు...

అంగన్వాడీల సమ్మెపై పరిష్కరించకపోగా ఎస్మా ప్రయోగించి మా కడుపులు కొట్టారన్నారు. వెంటనే జీతాలు పెంచి సమస్యను పరిష్కరించాల న్నారు. ఈ కార్యక్రమంలో అరుణ మహేశ్వరి గాయత్రి పుష్పవతి లతా శమంతకమణి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆర్థిక నేరస్తుడు..

## – టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా. బివి జయనాగేశ్వరరెడ్డి

విభారె న్యూస్ ఎమ్మిగనూరు జనవరి 13. సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆర్థిక నేరస్తుడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా. బివి జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు జగన్ మోహన్ రెడ్డి తీరును, పెత్తందారి పోకడలను వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలే బహిరంగంగా చెబుతున్నారని అన్నారు. జగన్ జేబు సంస్థ సీఐడిని అడ్డం పెట్టుకుని చంద్రబాబు నాయుడుపై కక్ష సాధింపు చర్యలతో పాటు నీలి మీడియాలో అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ రెడ్డిపై ఇప్పటికే 38 కేసులు ఉన్నాయని, 43 వేల కోట్ల రూపాయల దోపిడిపై సీబిఐ, ఈడీ చార్జిషీట్లు కూడా వేసిందని, ఈ కేసుల్లో ఇప్పటికి 3,500 సార్లు వాయిదా తీసుకున్న ఏకైక ఆర్థిక నేరస్తుడు జగన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. 2004లో అప్పుల వల్ల హైదరాబాద్ లో ఉన్న ఇల్లు అమ్ముకునే స్థితిలో ఉన్న జగన్ రెడ్డి 19 ఏళ్లలో రూ. 4 లక్షల కోట్లు ప్రజా సంపదను



మాట్లాడుతున్న బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి...

కొల్లగొట్టారన్నారు. జగన్ పాలనలో చంద్రబాబుపై 13 అక్రమ కేసులు పెట్టి ఏ కేసుకు ఆధారాలు చూపలేదన్నారు. జగన్ రెడ్డి కేసులపై సాక్షాత్తు గౌరవ జడ్జీలే కీలక వ్యాఖ్యలు చేసిన సందర్భాలు అనేకంగా ఉన్నాయన్నారు. ఎన్ని ఇబ్బందులకు గురి చేసి అక్రమంగా కేసులు పెట్టినా తెలుదేశం పార్టీ భయపడదని, రానున్న రోజుల్లో తగిన మూల్యం జగన్ రెడ్డి చెల్లించుకోక తప్పదన్నారు. ప్రజలు జగన్ రెడ్డి అక్రమాలను, అన్యాయాలను, అవినీతి పాలనను గమనిస్తూనే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు.

# డా. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు సేవలు కుల మతాలకు అతీతం..

## –ఆల్ ఫ్రెడ్ రాజు సేవలను పుణ్యగడ్డ

మంత్రాలయం ప్రజలు ఎన్నటికీ మర్చిపోరు..–మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థులు ఆశీస్సులు అందుకున్న డా. మల్లెల.. విభారె న్యూస్ జనవరి 13 ఎమ్మిగనూరు. ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏ.ఐ.సి.సి) రాష్ట్ర కార్యదర్శి, మల్లెల గ్రూప్స్ అధినేత, డాక్టర్ మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు మతసామరస్యాన్ని కాపాడుతూ కుల మతాలకు అతీతంగా అందిస్తున్న సేవలు అభినందనీయమని, ఆయన సేవలు మంత్రాలయం నకు ఎంతో అవసరమని మంత్రాలయం శ్రీశ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థులు పేర్కొన్నారు. శనివారం రాఘవేంద్ర స్వామి మఠం నందు డా. మల్లెలల్ఫ్రెడ్ రాజు మైసూర్ కు చెందిన శ్రీనివాస కళ్యాణ సేవా సమితి, సప్తర్షి సౌహార్ద పట్టిన కో–ఆపరేటివ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో పీఠాధిపతి చేతుల మీదగా 2024– నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి డా. మల్లెలల్ఫ్రెడ్ రాజును శాలువా కప్పి, పూలమాలవేసి మెమెంటో అందజేసి మంత్రోచ్ఛరణాలు చేసి ఆశీస్సులు అందజేశారు. ఆల్ ఫ్రెడ్ రాజు క్రైస్తవుడు అయినప్పటికీ బ్రాహ్మణుడైన తన మిత్రుడు"గురురాజ"తో స్నేహం కలిగి ఉ ఒడడంతో బ్రాహ్మణులలో మంచి పేరు తెచ్చు కొన్నారని తెలిపారు. పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో... విప్రభాండ్ పేరుతో వెంచర్ వేసి బ్రాహ్మణులకు సులభతరంగా సరసమైన ధరలకు ప్లాట్లు ఇచ్చారని, 2009 లో వరదలు సంభవించి మంత్రాలయం నీట మునిగి అతలాకుతలమైనప్పుడు ఆల్ ఫ్రేడ్ రాజు వద్ద ఉండి వరద బాధితులకు అందించిన సహాయం పుణ్యగడ్డ మంత్రాలయం ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని గుర్తు చేశారు. మల్లెలల్ఫ్రెడ్ రాజు కుల మతాలకు అతీతంగా సేవలను మరింతగా విస్తరింపజేసి మన మతం, మన తత్వం, మానవత్వం అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయనకు గురు రాఘవేంద్ర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ల్ఫ్రెడ్ రాజు ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో, దీర్ఘాయుష్యుడుగా వర్ధిల్లాలని వేద పండి తుల మధ్య దీవించా రు. ఈ కార్యక్రమంలో మల్లెల ల్ఫ్రెడ్ రాజ్ మిత్రబృందం గురురాజ్, యం. ఎస్. బసవన్న, సుబ్బన్న, రంగారావు, బి. ఆర్. నగేష్, రాధా కృష్ణ, పి. మహా దేవప్ప తదితరులు పాల్గొన్నారు



# వైయస్సార్ బీమా అందజేత



కోసిగి, జనవరి 13(విభారె న్యూస్) కోసిగి మండల పరిధిలోని అగసనూరు గ్రామానికి చెందిన దాసరి సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మరియు మండల ఇంఛార్జి మురళి మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారంనాడు గ్రామ సర్పంచ్ ఉల్లిగయ్య, మాజి సర్పంచ్ ఆకాశ్ రెడ్డిఅధర్వంలోవైయస్సార్ బీమా 10,000 రూపాయలు నగుదును మృతుని భార్య దాసరి గీతకు అందజేయడం జరిగింది వైయస్సార్ బీమాకిందఆయనకులక్ష రూపాయలు బీమా పథకం విడుదలైంది మిగతా నగదు 90000 వేలు నామిని ఖాతాలో త్వరలో జమ కానున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో గోర్లి శివయ్య చిన్నముతి ఉలిగయ్య హనుమప్ప నర్సయ్య భీమన్న నాగేంద్ర యువ నాయకులు బాబు రెడ్డి బసన్న నాగరాజు సతీష్ మరియు గ్రామ నాయకులు గ్రామ వాలంటీర్లు పాల్గొనడం జరిగింది.

# కార్యకర్తలకు అండగా ఉంటాం.. మురళీ మోహన్ రెడ్డి



కోసిగి, జనవరి13(విభారె న్యూస్) కార్యకర్తలకు అండగా రాంపురం రెడ్డి సోదరులు ఎల్లప్పుడూ నిలుస్తారని మండల ఇంచార్జీ శ్రీ పి మురళీ మోహన్ రెడ్డి అన్నారు. మండలం కేంద్రము కోసిగి వైయస్సార్సీపీ నాయకులు/యంపీటీసి గానుగ వీరాస్వామి తండ్రి గానుగ తిప్పయ్య (80) అలాగే జుమ్మలదిన్నె గ్రామ వైకాపా కార్యకర్త ఈడిగ జయరాం (48) అనారోగ్యంతో బాధపడుతూ, మరణించారు. శనివారం రోజు ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కోసిగి మండల ఇంచార్జీ పి మురళీ మోహన్ రెడ్డి కోసిగిలో గానుగ తిప్పయ్య జుమ్మలదిన్నెలో ఈడిగ జయరాం మృతదేహాలకు పూలమాలవేసినివాళులర్పించారుఅనంతరం కుటుంబ సభ్యులకు పరమార్శించి, అండగా నిలుస్తామని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో జగదీష్ స్వామి, కొరివి నాగరాజు, బుడగ జంగాల అయ్యప్ప, అంజి, ప్రవీణ్ కుమార్, గ్యాంగ్ ఈరన్న, పాండుస్వామి, తిమ్మారెడ్డి, నీలకంఠ, నాగమ్మ, సిద్దరామ, రామయ్య, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన వైసీపీ నాయకులు



విభారె న్యూస్ జనవరి 13 కర్నూలు (జిల్లా ప్రతినిధి). కర్నూలు నగరానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, వెంకట్రాముడు, 20 మంది అనుచరులు శనివారం ఉదయం విజయవాడ నందలి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రుద్రరాజు వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు రాఘవేందర్ రెడ్డి, వెంకట్రాముడు మాట్లాడుతూ యువ నాయకులు రాహుల్ గాంధీ ని ఆదర్శంగా తీసుకొని కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు సాయశక్తుల కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# జర్నలిస్టులు పేదవారే





ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులందరూ దారిద్ర రేఖకు దిగువన ఉన్న పేద వారేనని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ సీనియర్ వైద్యులు శంకర్ శర్మ తెలిపారు. ఈరోజు కర్నూల్ కలెక్టర్ కార్యాలయంలోని సమాచార శాఖ కార్యాలయంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని నిరుపేద జర్నలిస్టులకు ఆయన నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు శంకర్ శర్మ మాట్లాడుతూ పేదరికంతో జర్నలిస్టులు తమ విధి నిర్వహణలో నిర్వహిస్తూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో కీలకంగా వహిస్తున్నారన్నారు. సరైన సమయ సందర్భాల్లో తిన్న తినక పోయిన వాళ్లు విధులను నిర్వహించడం కష్టమైన పని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మనోహర్ మల్లికార్జున శ్రీనివాసులు రామస్వామి ఆంజనేయులు రామకృష్ణ చెన్నయ్య రమేష్ తల్లి పాల్గొన్నారు

# ముచ్చుమర్రి సబ్-ఇన్స్పెక్టర్ గా అర్ .జయ శేఖర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 13– ముచ్చుమర్రి సబ్ ఇన్ స్పెక్టర్ గా అర్. జయ శేఖర్ శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా కర్నూల్ జిల్లా ఆదోని 3 టౌన్ పోలీసు స్టేషన్ నందు సబ్–ఇన్స్పెక్టర్ గా పనిచేస్తు నంద్యాల జిల్లా ముచ్చుమర్రి పోలీసు స్టేషన్ కు బదిలీ అయిన అర్ .జయ శేఖర్ .శనివారం ముచ్చుమర్రి పోలీసు స్టేషన్ నందు బాధ్యతలు స్వీకరించిన అనంతరం నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె రఘువీర్ రెడ్డి గారిని జిల్లా పోలీస్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# ఓపి ఐపీ రిజిస్ట్రేషన్ కేంద్రం ప్రారంభ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 13–. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల లో నూతనంగా నిర్మించిన ఓపి మరియు ఐపి రిజిస్ట్రేషన్ కౌంటర్స్ మరియు జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం ను శనివారం ప్రారంభించిన నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి , మైనారిటీస్ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా , ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ,నంద్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ మాబున్నీసా. ,ఏపీఎస్పీడీసియల్ డైరెక్టర్ శశికళ రెడ్డి , దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృత రాజ్ ,డిఎంహెచ్ఓ వెంకటరమణ , డీ సీ హెచ్ ఎస్ జఫ్రుల్లా ,వైద్యశాల సిబ్బంది తదతరులు. పాల్గొన్నారు.

# ఉజ్వలయోజన పథకం లబ్ధిదారులకు గ్యాస్ పంపిణీ..

విభారె న్యూస్ జనవరి 13 కర్నూలు..బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటిపురందేశ్వరి ఆదేశాలతో కర్నూలు జిల్లా అధ్యక్షులు కునిగిరినీలకంఠ సూచనలతో కోడుమూరు అసెంబ్లీ కోకన్వీనర్ వేల్పులగోపాల్ పర్యవేక్షణలో కర్నూలు రూరల్ మండల అధ్యక్షులు బేస్తఈరన్న ఆధ్వర్యంలో బాలాజినగర్ బిజెపి కార్యాలయం నందు ఉజ్వల యోజన పథకం ద్వార నిరుపేద మహిళలకు ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం అయినది వేల్పులగోపాల్ మాట్లాడుతూ భారతప్రధాని నరేంద్రమోడీ మహిళల ఇబ్బందులను అవసరాలను గుర్తిరిగే గ్యాస్ యోజన పథకం ద్వార నిరుపేదలైనటువంటి వారికి 6100 రూపాయలు నటువంటి గ్యాస్ కలెక్షన్లను ఉచితంగా గ్యాస్ పంపిణీ భారతదేశవ్యాప్తంగా నిర్వహించబడుతుంది కనుక ప్రతి ఒక్క నిరుపేద మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు ఈకార్యక్రమంలో ఓబిసి మోర్చ జిల్లా ప్రధానకార్యదర్శి ఉల్సాల లక్ష్మణ నాయుడు ఓబిసి మోర్చ జిల్లా కోశాధికారి మహేంద్ర గంగాధర్ అదినారాయణ అచ్చారీ పరిశరాముడు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190